క్లుప్తంగా

దేవాలయం నిర్మాణానికి విరాళం



విరాళంను దేవాలయ కమిటీకి అందచేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని టీఎస్ కూళ్లూరు గ్రామంలో కొత్తగా నిర్మాణం చేస్తున్న శివాలయానికి ప్రకాశం జిల్లా ఎలగండ్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన స్పైక్లారు కంపెనీ అధినేత ఎం. శ్రీనివాసరెడ్డి రూ. 1,11,111లు విరాళంగా ఇచ్చారు. గ్రామానికి చెందిన సప్పాగు శాంతిరాజు ద్వారా ఈ నగదును శనివారం దేవాలయం నిర్మాణ కమిటీకి అందించారు. హనుమంతయ్య, చిన్న లక్ష్మణ్ణ, కొత్తపల్లి లక్ష్మన్న పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రార్థనలు

తుగ్గలి : మండల పరిధిలోని రాతన చెరువులో శనివారం ముస్లింలు వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తీవ్ర వర్షాభావంతో పంటలు ఎండుతుండడంతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అల్లాను వేడుకున్నారు. కార్యక్రమంలో హుసేన్‌సాహెబ్, సయ్యద్‌వలీ, చిన్న కాశీం, అబ్దుల్‌సాహెబ్, షార్మాస్, ఈసూబ్, పీరా సాహెబ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు, విద్యార్థినులకు అభినందనలు

గోనెగండ్ల: స్థానిక ఎంపీయూపీ(హరిజనవాడ) పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న విజయ భాస్కర్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే ఇటీవల విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ ప్రోగ్రాంలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు సైన్స్ ప్రాజెక్టులో ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. శనివారం ఎంఈఓ- 1,2 రామాంజినేయులు, నీలకంఠ ఆ పాఠశాలలకు వెళ్లి వారిని అభినందించారు. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి మునుముందు మరిన్ని విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షాహినా పర్వీన్, సీఆర్‌పీలు విజయరామ్ రెడ్డి, పుల్లన్న, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు

నందవరం: మండల పరిధిలోని జోహరాపురం గ్రామంలో విగ్రహాల ప్రతిష్ఠాపనలో భాగంగా రెండో రోజు శనివారం బొడ్రాయి, నందీశ్వర, నవగ్రహాలకు మంగళ వాయిద్యాల నడుమ భక్తులు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నదిలో నుంచి నూతన విగ్రహాలను బయటకు తీసి ప్రత్యేక పూజలు చేపట్టి, మహిళలు కలశాలతో ఎద్ల బండ్లపై ఊరేగించారు. పురోహితులు గుండయ్యస్వామి ఆధ్వర్యంలో నూతన దంపతులు సకల దేవత మంటపంలో హోమ పూజలు గావించారు. ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి, సోమశంకరరెడ్డి, తిప్పారెడ్డి, నాగిశేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

కృష్ణగిరి: ఆరోగ్యమే మహాభాగ్యమని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. కృష్ణగిరి కస్తూర్బా విద్యాలయంలో శనివారం స్వచ్ఛతా పఖ్వాడ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత, చేతుల పరిశుభ్రతపై జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి సునీతతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాలతో ఈ నెల 1 నుంచి 15 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్వచ్ఛతా పఖ్వాడ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 మద్దయ్య, కస్తూర్బా ప్రిన్సిపాల్ చైతన్య ప్రవంతి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలికకు గాయాలు



గాయపడిన బాలిక సంజన

దేవనకొండ : మండలంలోని నేలతలమరి గ్రామానికి చెందిన బోయ బజారి కుమార్తె సంజన శనివారం సాయంత్రం వీధిలో ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో ఆ బాలిక తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్సల కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

సేవలతోనే గుర్తింపు

నందవరం : ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుందని మండల విద్యాధికారులు సుదర్శన్‌రెడ్డి, రఘునాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(స్పెషల్)లో బదిలీ, ప్రమోషన్‌పై వెళ్లిన 16 మంది ఉపాధ్యాయులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ట్యాంకులు శుభ్రంగా ఉండాలి

ఆలూరు: మండల కేంద్రంలోని నీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని సర్పంచ్ అరుణాదేవి, ఈఓ బి.కృష్ణకుమార్ కార్మికులను ఆదేశించారు. శనివారం స్థానిక సంతమార్కెట్, లైబ్రరీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయం, కోయినగర్ కాలనీలలో ఓహెచ్‌ఆర్ ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుద్ధి చేయించారు.



వెల్దుర్తిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు



చిప్పగిరిలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ విరుపాక్షి



ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పాలు పంపిణీ చేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, చైర్మన్ రఘు

జనహృదయాల్లో చిరస్థాయిగా వైఎస్సార్

- మహానేతకు ఘన నివాళి

వెల్దుర్తి: పద్నాలుగేళ్ల క్రితం ఇదే రోజున దివంగత మహానేత, మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి లోకాన్ని విడిచి వెళ్లినా ఆయన అభిమానుల మదిని వీడలేదని, ఆయన సేవలను ప్రజలు మరువలేరని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె తమ పార్టీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ ముత్యాల శైలజతో కలిసి పాతబస్టాండులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ తన సుపరిపాలనతో ప్రజా బాంధవుడయ్యాడన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో నాయకులు అగస్టీన్, పెద్దిరెడ్డి, అశోక్ రెడ్డి, వెంకట్‌నాయుడు, ఆరిఫ్, చక్రపాణి రెడ్డి, శంకర్ రెడ్డి, రాజు, శివారెడ్డి, గోపాల్ రెడ్డి, పెద్దన్న, మోహన్, ఏసు, బాలాజీ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

దేవనకొండ : మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ మహానేత రాష్ట్ర ప్రజలకు అనేక పథకాలను ప్రవేశపెట్టి ఆదుకున్నారన్నారు. నేడు రైతాంగం అన్నివిధాలా అభివృద్ధి చెందిందంటే, సాగునీటి ప్రాజెక్టులు వచ్చాయంటే అందుకు వైఎస్సార్‌నే కారణమని చెప్పారు. గుమ్మనూరు నారాయణస్వామి, జెడ్పీటీసీ రామకృష్ణ, లుముంబా తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని శనివారం తుగ్గలి, రాతన, బొల్లవానిపల్లి, ఉప్పర్లపల్లి, బొందిమడుగులలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జగన్నాథరెడ్డి, సర్పంచ్‌లు ప్రభాకరరెడ్డి, రాచప్ప, రాతన విజయమోహన్‌రెడ్డి, పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్‌రెడ్డి, సురేంద్రనాథరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, పురుషోత్తం తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. బొల్లవానిపల్లిలో పార్టీ నాయకులు చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని జగన్నాథరెడ్డి ప్రారంభించారు.

కృష్ణగిరి: మండల కేంద్రమైన కృష్ణగిరిలో వైఎస్‌ఆర్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ లక్ష్మీకాంతరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల కో-అప్షన్ మెంబర్ షేక్ షాలుమియ్యా, నాయకులు శిగరమాను కృష్ణమూర్తి, వెంకటేశ్వరరెడ్డి, చంద్రమోహన్‌గౌడ్, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర : పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేసి వారి గుండెల్లో కొలువైన మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం, పెరవలి వర్ధంతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు మల్లికార్జున, విజయుడు, జిల్లా కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్ : స్థానిక చక్రాళ్ల రోడ్డు కూడలిలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటుచేశారు. అలాగే శారద వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు కోటేశ్వరరావు, ఎంపీటీసీలు అనిత, సరోజ పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: స్థానిక పోస్టాఫీసు ఎదురుగా ముస్లిం వీధిలో ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ ఎం.నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.శ్రీరంగడు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఎస్. నాగరత్నమ్మ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, మండల కన్వీనర్ కారం నాగరాజు, వైస్ ఎంపీపీ బలరాముడు, ఎంపీటీసీ సభ్యులు నీలకంఠ, నెట్టికల్లు, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టరు టీఎండీ హుసేన్, మాజీ వైస్ ఎంపీపీ పల్లెప్రతాప్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ఎంఎస్ మధు తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి : దివంగత మహానేత వైఎస్సార్ వర్ధంతిని శనివారం మండలకేంద్రమైన హాలహర్విలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లింగప్ప, మండల కన్వీనర్ భీమప్పచౌదరి, చింతకుంట సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీటీసీలు గంగమ్మ, గోపాల్, లక్ష్మన్న, చింతకుంట పరశురామ్, బాపురం నాపేంద్ర సర్పంచ్ మల్లి, ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకుడు ఈశా, అగ్రికల్చర్ అడ్వైజర్ బోర్డు చైర్మన్ మల్లికార్జున తదితరులు వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కెంచప్ప, రామకృష్ణ, ఎస్కే గిరి, పంపాపతి, మల్లయ్య, దొడ్డబసప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: స్థానిక వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీటీసీ దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ గోవర్ధన, సీఈఓ ఆశోక్, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దయ్య, తిమ్మప్ప, ప్రకాష్, విజయ్. చిన్న గోవర్ధన తదితరులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

చిప్పగిరి: మండలకేంద్రంలో జెడ్పీటీసీ విరుపాక్షి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఓబులేష్, మల్లికార్జున, లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం

ఎమ్మిగనూరు టౌన్: స్థానిక సోమప్ప సర్కిల్‌లో వైఎస్సార్ చిత్రపటానికి, వైఎస్సార్ సర్కిల్‌లోని మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహనికి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎర్రకోట యూత్ ఆధ్వర్యంలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. వెంకటాపురంలో కౌన్సిలర్ బజారి ఆధ్వర్యంలో, రాష్ట్ర వీరశైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్ స్థానిక వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో మాజీ కోఆప్షన్‌మెంబర్ బందెనవాజ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రఫీక్, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవింద్, ఉస్మాన్, ఖాజాపటేల్, రఘు, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట, పార్లపల్లి, కలుగోట్ల, కందనాతి గ్రామాల్లోని దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాకుల నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. కందనాతి వైస్సార్‌సీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పీఎంసీ చైర్మన్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గొర్రెల కాశి, వెంకటేష్ పాల్గొన్నారు.

నందవరం : మండల కేంద్రలోని సచివాలయం-1లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు, నారికేళాలు సమర్పించి నివాళులర్పించారు. ముగతి గ్రామంలో గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హాలహర్విలో వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మప్ప వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కృష్ణగిరిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పత్తికొండలో ప్రజలకు అన్నం వడ్డిస్తున్న పి.మురళీధర్‌రెడ్డి



ఎమ్మిగనూరులో వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రుద్రగౌడ్



కందనాతిలో నివాళులర్పిస్తున్న నాయకులు



నందవరంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జాబ్‌మేళాలతో యువతకు ఉపాధి అవకాశాలు

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం ఉపాధి అవకాశాలు చూపేందుకు ఎన్నో చర్యలు తీసుకుంటోందని, ఇందులో భాగంగా జాబ్‌మేళాలు సైతం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖతో పాటు స్థానిక రావూస్ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఈనెల 12న నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళా కరపత్రాలను ఎమ్మెల్యే తన నివాసంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్, కళాశాల సీఈఓ తిరుమల్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలైన హెటిరో డ్రగ్స్, హిల్‌మైఫ్యామిలి, అమర్ రాజబ్యాటరీస్, అరబిందో ఫార్మా, నవభారత్ ఫర్టిలైజర్స్, ఫ్లిప్‌కార్ట్, డి.మార్ట్, శ్రీరామ్ చిట్స్ లైఫ్‌ఇన్సూరెన్స్, మెడ్‌ప్లస్, స్పందన స్ఫూర్తి తదితర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరుగుతుందని సీఈఓ తెలిపారు. ఆయా ఉద్యోగాలకు 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఎంబీఏ, ఎంసీఏ తదితర విద్యార్హతలున్న వారు అర్హులన్నారు. వివరాలకు సెల్ నంబర్ 99854 96587, 77994 94856లకు సంప్రదించాలన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, తదితరులు

ఏటీఎం మోడల్ పంట సాగు

వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోటలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఏటీఎం (ఎనీటైంమనీ-365 రోజుల ఆదాయం) మోడల్ పంట సాగును శనివారం ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ శాఖ డివిజనల్ యాంకర్ మాబువలి, మెంటర్ సురేంద్ర, ఎంటీ వెంకటేశ్వర్లు, సిబ్బంది ద్వారా రైతు ఉప్పరి వెంకటస్వామి పొలంలోని 30సెంట్లలో ఏటీఎం కామధేను ఆకు,కూరగాయల 22 రకాల విత్తన సాగు జరిగింది. మాబువలి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు ఏటీఎం సాగు ద్వారా 365 రోజుల ఆదాయం కేవలం 20 నుంచి 50 సెంట్ల పొలంలో సాధించవచ్చన్నారు. ఈ పద్ధతిలో ఒక్క రోజు లోపు వచ్చే పంట సైతం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ సాంబశివుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీకాంత్, జనార్దన్, రైతులు పాల్గొన్నారు.

నెరణికి తండాలో విగ్రహ ప్రతిష్ఠ

హొళగుంద: నెరణికి తండా గ్రామంలో శనివారం అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా నెరణికి, నెరణికి తండా పురోహితులు రాధాకృష్ణమూర్తి స్వామి, రవిశాస్త్రి స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం వరుణ పూజ, గోపూజ, గణపతి పూజ, కలశ స్థాపన తదితర పూజలు జరిగాయి. శనివారం తెల్లవారు జామున 4 గంటలకు యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.


రైతులను ఆదుకోవాలి

ఆస్పరి/పత్తికొండ రూరల్ / ఆలూరు: ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. శనివారం బస్సు యాత్రలో భాగంగా కర్నూలు నుంచి ఆలూరుకు వస్తుండగా ఆస్పరి సమీపంలో పత్తి పైరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. పత్తికొండలో బస్సు యాత్రకు సీపీఐ నాయకులు ఎర్ర జెండాలతో స్వాగతం పలికారు. అలాగే ఆలూరులోను బస్సుయాత్ర కొనసాగింది.

శ్రీరంగనాథుడుకి ప్రత్యేక పూజలు

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు శ్రావణమసం మూడవ శనివారం పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మూలవిరాట్, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులను సతీసమేతంగా పల్లకీలో కొలువుంచి వేదమంత్రాలతో ఆలయ ప్రదక్షిణలు చేశారు. అనంతరం గ్రామానికి 3 కి.మీ దూరంలో వున్న దొనకు స్వామి వారి పాదాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పాదపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ దస్తగిరిగౌడ్, దాతలు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్, అర్చకులు రంగస్వామి పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



బెంగళూరులో ఉన్న రాతన రంగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రతాప్

తుగ్గలి : అర్హులైన వారందరికీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని గిరిగెట్ల, బొందిమడుగుల సచివాలయ కన్వీనర్లు విష్ణువర్ధనరెడ్డి, ఈశ్వరరెడ్డి అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లను శనివారం వారు ఆర్‌ఐ సుధాకరరెడ్డి, సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వృద్ధాప్య సమస్యలో బాధపడుతూ బెంగళూరులో కొడుకు వద్ద ఉన్న రాతన కలగంటి రంగమ్మ వద్దకు వెళ్లి వలంటీర్ ప్రతాప్ పింఛన్ అందజేశారు.

కర్నూలు ఆసుపత్రికెళ్లి పింఛన్ పంపిణీ

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని బగిలి విధికి చెందిన చెద్దె మునెప్ప అనారోగ్యంతో కర్నూలు మెడికోవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పింఛన్ పంపిణీలో భాగంగా మునెప్ప విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ ముల్లా షఫీ శనివారం కర్నూలులో ఆస్పత్రికి వెళ్లి మునెప్పను పరామర్శించి పింఛన్ నగదు రూ.2,750 అందజేశాడు.

కష్టకాలంలో పింఛన్‌తో ఆదుకున్నారు

కృష్ణగిరి: టి.గోకులపాడు గ్రామానికి చెందిన పరిగేల దేవదాసుకు భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమారులు ఉన్నారు. రోజువారి కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇంతలో ఇంతలోనే విధి చిన్నచూపు చూసింది. దేవదాసు బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆరు నెలలు ఆస్పత్రిలో చికిత్స ఆరోగ్యశ్రీ కింద పొందాడు. వీరి కుటుంబంలో కుటుంబ పెద్ద ఇలా కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేసినా ఇంటికి వచ్చినా తరువాత నెల నెల మందుల కోసం డబ్బులకు ఇబ్బంది పడుతున్న సమయంలో నూతన పింఛన్ మంజూరు కావడంతో మా కుటుంబాన్ని ఆదుకున్నారని కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

మంచి జరిగి ఉంటేనే మాకు ఓటేయండి

- మంత్రి గుమ్మనూరు జయరాం
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజా సమస్యల పరిష్కారం
- ప్రజల ఆశీస్సులతో మరోసారి రాబోయేది జగనన్న ప్రభుత్వమే...



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

దేవనకొండ : మీకు మంచి జరిగి ఉంటేనే తమ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రజలను కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే వీలు కలిగిందన్నారు. శనివారం మండలంలోని వెలమకూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశ చరిత్రలోనే ఇంటింటికీ ఎమ్మెల్యేలను పంపించి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేలా ఏ పార్టీ, ప్రభుత్వం చేయలేదన్నారు. ప్రజల ముంగింటకే అధికారులు, ప్రజాప్రతినిధులు చేరి సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు.

వెలమకూరు రూ.9.36 కోట్లతో అభివృద్ధి

వెలమకూరు గ్రామ పంచాయతీకి రూ.9.36 కోట్లతో నాలుగు సంవత్సరాల వ్యవధిలో ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. జల జీవన్ మిషన్ కింద రూ.18 లక్షలు, సింగాపురం, వెలమకూరు, కూకటికొండ పంచాయతీలకు మంజూరయ్యాయన్నారు. చంద్రబాబునాయుడు, నారా లోకేష్ ఎక్కడ కాలు పెడితే అక్కడ కరువే ఏర్పడుతుందని ఆరోపించారు. కర్నూలు జిల్లాలో వారు అడుగుపెట్టినప్పటి నుంచి వర్షాలు కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి, జెడ్పీటీసీ రామకృష్ణ, మండల కన్వీనర్ మల్లికార్జున, మండల కో-కన్వీనర్ కబీర్ దాస్, నాయకులు రామచంద్ర, కూకటికొండ, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు రోడ్డుపై వదిలిన వారికి నోటీసులు

చిప్పగిరి: మురుగునీరు రోడ్డుపై వదులుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 30 మంది నేమకల్లు గ్రామవాసులకు నోటీసులు జారీ చేసినట్లు గ్రామ పంచాయితీ కార్యదర్శి బాలన్న తెలిపారు. శనివారం వారు గ్రామంలో పలు కాలనీల్లో పర్యటించి ఇంకుడు గుంతల నిర్మించుకోవాలని ప్రజలకు సూచించారు. నోటీసుల ఇచ్చినా స్పందించక పోతే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పావని, లక్ష్మి, రాజేశ్వరి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

గోనెగండ్ల: కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను, పెంచిన కరెంట్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎండీ ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గోనెగండ్లలోని నాలుగు సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన గోనెగండ్లలో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దండు ఖాజా, కరుణాకర్, మారేష్, ఈశ్వరయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొలాల రస్తాకు మరమ్మతు

హొళగుంద: లింగంపల్లి గ్రామ పరిధిలో అధ్వానంగా ఉన్న పొలాల రస్తాను శనివారం గ్రామానికి చెందిన రైతులు, గ్రామపెద్దలు శ్రమదానం చేసి బాగు చేసుకున్నారు. ఈ రస్తాలో అడ్డంగా ముళ్లకంపలు, పిచ్చి మొక్కలు పెరిగి, మోకాలోతు గుంతలు పడి ఉండేది. గ్రామపెద్దలు విరుపాక్షరెడ్డి, బండారి హనుమేష్, ఈడిగ ఈరన్న, కురె హనుమేష్, ఈరారెడ్డి, మాల గిరెప్ప తదితరులు ముందుకొచ్చి ముళ్లకంపలు తొలగించి, గుంతలు పూడ్చి రోడ్డును చదును చెయించారు.

సుధాకర్‌శెట్టికి నివాళి

పత్తికొండ రూరల్ : స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో శనివారం సుధాకర్‌శెట్టి 3వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు దస్తగిరి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పత్తికొండటౌన్: బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం పత్తికొండలో సీఎం సహాయనిధి కింద మంజూరైన రు.6లక్షలు చెక్కులను ఆయా బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు. మద్దికెర మండలం బురుజుల గ్రామానికి చెందిన రాఘవేంద్రరెడ్డి కుటుంబానికి రూ.3లక్షలు, ప్రమాద వశాత్తు మృతి చెందిన పత్తికొండ మండలం హోసూరు గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు కుటుంబానికి రూ..2లక్షలు, పాముకాటుతో మరణించిన తుగ్గలి మండలం అమీనాబాదు గ్రామానికి చెందిన సింగరి నారాయణస్వామి కుమారుడు సింగరి రమేశ్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం మంజూరయ్యింది.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వైభవంగా క్షేత్రగుడి ఆంజనేయస్వామి రథోత్సవం

హాలహర్వి : మండల కేంద్రమైన హాలహర్వి గ్రామశివారులో కొలువై ఉన్న క్షేత్రగుడి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస మూడో శనివారం సందర్భంగా రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తుల జయజయ ధ్వనుల మధ్య రథాన్ని లాగారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



గజ్జహళ్లిలో ఆంజనేయస్వామి అరటి పండ్ల అలంకరణ

పవనపుత్రుడికి శ్రావణమాస పూజలు

హొళగుంద: మండల పరిధిలోని హొళగుంద, లింగంపల్లి, గజ్జహళ్లి తదితర గ్రామాలలో వెలిసిన ఆంజనేయస్వామికి శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గజ్జహళ్లిలో వెలిసిన కట్టె ఆంజనేయ స్వామికి భక్తులు అరటి పండ్లతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నదీ జలాలతో దేవతామూర్తులకు అభిషేకం

ఎమ్మిగనూరురూరల్: శ్రావణ శుక్రవారం గంగా జలం కోసం గురుజాలకు తరలి వెళ్లిన గుడేకల్ గ్రామస్తులు శనివారం ఉదయం గ్రామానికి చేరుకున్నారు. జలంతో గ్రామానికి చేరుకున్న వారికి ప్రజలు పెద్ద ఎత్తున హారతలు, డప్పులతో గ్రామ వీధుల్లో ఉరేగింపుగా తీసుకెళ్లారు. మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు నదీ జలాలతో వచ్చిన వారిని ఉరేగింపు నిర్వహించారు. అనంతరం నదీ జలాలతో గ్రామంలోని అన్ని దేవాలయాల్లోని దేవతామూర్తులకు అభిషేకం చేశారు. నదీ జలాలను తెచ్చిన బిందెలను నెత్తిన పెట్టుకున్న భక్తులు కొరడాలతో తమను కొట్టుకుంటు ఆయా దేవాలయాల్లోకి వెళ్లి నీటితో స్వామికి అభిషేకించారు. అలాగే మండల పరిధిలోని మాసుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ప్రజలు గురుజాల నుంచి తెచ్చిన నదీ జలాలతో ఉరేగింపుగా వెళ్లారు. తెచ్చిన నీటిని దేవాలయాల్లో దేవతామూర్తులకు అభిషేకం చేశారు.



గుడేకల్‌లో నదీజలాలను ఉరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం